# ఉప ఎన్నికలు రావు



- ఎమ్మెల్యేలు ఆందోళన చెందొద్దు..
- బీఆర్ఎస్ విధానాన్నే కొనసాగిస్తున్నాం..
- ఆన్లైన్ బెట్టింగ్‌లపై కఠిన చర్యలు
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

04

అక్షర దర్బార్
www.aksharadarbar.com
voice of the people
వెల ₹5
బుధవారం 26, మార్చి 2025 | సంపుటి :02 | సంచిక :41 | పేజీలు :06

# నాయిని చొరవతో నగర ప్రజలకు ఊరట



- ఆస్తి పన్నుపై వడ్డీ బకాయిలో 90 శాతం రాయితీ
- అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- సమర్థించిన సహచర శాసన సభ్యులు
- సానుకూలంగా స్పందించిన రాష్ట్రప్రభుత్వం
- మున్సిపల్ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ..

03


మీ అమ్మ చేతి బువ్వ ఎప్పుడు తింటిరో... మీ అయ్య నోటి మాటలెప్పుడు వింటిరో.. మీ అన్నదమ్ములనే మర్చిపోతిరో.. మీ అక్కచెల్లెలిపుడు యాడ ఉన్నరో.. అంటూ కన్నవాళ్లను, ఉన్న ఊరిని విడిచి విప్లవోద్యమానికి ఆకర్షితులై అడవిబాట పట్టిన అన్నల కోసం కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. ఇటీవల వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని ఉలిక్కిపడుతున్నాయి. పోలీసులు నిర్ధారించిన తర్వాత చనిపోయిన వాళ్లలో తమ బిడ్డలు లేరని తెలిసి ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఉద్యమానికి ఊపిరులూదిన ఉమ్మడి వరంగల్ జిల్లా వరుస ఎదురు దెబ్బలతో క్రమంగా తన పట్టు కోల్పోతుంది. విప్లవ భావాలతో దశాబ్దాల కింద అడవిబాట పట్టిన వారిలో ఒక్కొక్కరుగా నేలకొరుగుతున్నారు. కీలక నేతలు కొందరు అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులు, వయోభారం కారణంగా తనువు చాలిస్తుంటే... మరికొందరు కాల్పుల్లో మరణిస్తున్నారు. తాజాగా మంగళ వారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్లో మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్ అంకేశ్వరం సారయ్య అలియాస్ సుధీర్ అలియాస్ సుధాకర్ అలియాస్ మురళీ మృతి చెందడం జిల్లాలో కలకలం రేపింది. అయితే ఎన్ని ఎదురు దెబ్బలు తగులుతున్నా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలు ఇప్పటికీ మావోయిస్టు పార్టీలో కీలక హోదాల్లో పని చేస్తున్నారు. పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు. - అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

- ఓరుగల్లులో మావోయిస్టులకు వరుస ఎదురు దెబ్బలు
- ఎన్‌కౌంటర్లలో మృత్యువాత పడుతున్న మావోయిస్టులు
- తాజాగా ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో అంకేశ్వరం సారయ్య హతం
- దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్‌గా బాధ్యతలు
- ఇప్పటికీ పార్టీలో కీలకంగా పలువురు ..
- ఉమ్మడి జిల్లా నుంచి 26 మంది విప్లవోద్యమంలో..
- ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా ఉలిక్కిపడుతున్న కుటుంబాలు
- లొంగిపో బిడ్డా అంటూ తల్లిదండ్రుల వేడుకోలు..

02

# నింగికెగుస్తున్న నేలతారలు!

పోరుదారిలో నేలకొరుగుతున్న అగ్రనేతలు



మట్టిని అడ్డగోలుగా

# మింగేస్తున్నారు..!

- కాటారం సబ్ డివిజన్ మండలాల్లో జోరుగా అక్రమ మట్టి దందా
- అభివృద్ధి పనుల పేరుతో కాంట్రాక్టర్ల దుశ్చర్యలు
- చెరువు, అటవీ, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు
- సెలవు దినాల్లో అపకార్యాలకు పాల్పడుతున్న వైనం
- కఠిన చర్యలు తీసుకోకుండా వంత పాడుతున్న అధికారులు

03



# ప్రాణాలు తీస్తున్నయ్

ప్రమాదకరంగా పాత బంగ్లాలు

- భద్రాచలంలో కుప్పకూలిన ఐదు అంతస్తుల భవనం
- పాత భవనంపై కొత్త నిర్మాణంతోనే ప్రమాదం
- పలువురు మృతి.. శిథిలాల కింద మరికొందరు !
- రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఘటన
- ట్రైసిటీలోని పాత భవంతులు పదిలమేనా అంటూ తెరపైకి చర్చ
- గతంలోనూ నగరంలో పాత భవనాలు కూలి ముగ్గురి మృతి..

04

# నిర్లక్ష్యంపై కమిషనర్ ఫైర్

- పిన్ పాయింట్ ప్రోగ్రాం షెడ్యూల్ పాటించని జవాన్ కు షోకాజు నోటీసు
- క్షేత్రస్థాయిలో ట్రేడ్, ఆస్తి పన్ను వసూళ్ల తీరు పరిశీలన
- శానిటేషన్ లో పిన్ పాయింట్ ప్రోగ్రాంను అమలు చేయాలని ఆదేశాలు

03

బుధవారం
26.03.2025
www.aksharadarbar.com
అక్షర దర్బార్ voice of the people




# నింగికెగుస్తున్న నేలతారలు!

## పోరుదారిలో నేలకొరుగుతున్న అగ్రనేతలు

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: మీ అమ్మ చేతి బువ్వ ఎప్పుడు తింటిరో... మీ అయ్య నోటి మాటలెప్పుడు వింటిరో.. మీ అన్నదమ్ము లనే మర్చిపోతిరో.. మీ అక్చెల్లెలెప్పుడు యాడ ఉన్నరో.. అంటూ కన్నవాళ్లను, ఉన్న ఊరిని విడిచి విప్లవోద్యమానికి ఆకర్షితులై అడవిబాట పట్టిన అన్నల కోసం కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. ఇటీవల వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని ఉలిక్కిపడుతున్నాయి. పోలీసులు నిర్ధారించిన తర్వాత చనిపోయిన వాళ్లలో తమ బిడ్డలు లేరని తెలిసి ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఉద్యమానికి ఊపిరులూదిన ఉమ్మ డి వరంగల్ జిల్లా వరుస ఎదురు దెబ్బలతో క్రమంగా తన పట్టు కోల్పోతుంది. విప్లవ భావాలతో దశాబ్దాల కింద అడవి బాట పట్టిన వారిలో ఒక్కొక్కరుగా నేలకొరుగుతున్నారు. కీలక నేతలు కొందరు అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులు, వయోభారం కారణంగా తనువు చాలిస్తుంటే... మరికొందరు కాల్పుల్లో మరణిస్తున్నారు. తాజాగా మంగళవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్లో మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్ అంకేశ్వరం సారయ్య అలియాస్ సుధీర్ అలియాస్ సుధాకర్ అలియాస్ మురళీ మృతి చెందడం జిల్లాలో కలకలం రేపింది. అయితే ఎన్ని ఎదురు దెబ్బలు తగులుతున్నా ఉమ్మ డి జిల్లాకు చెందిన పలువురు నేతలు ఇప్పటికీ మావోయిస్టు పార్టీలో కీలక హోదాల్లో పని చేస్తున్నారు. పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు.



* ఓరుగల్లులో మావోయిస్టులకు వరుస ఎదురు దెబ్బలు
* ఎన్‌కౌంటర్లలో మృత్యువాత పడుతున్న మావోయిస్టులు
* తాజాగా ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో అంకేశ్వరం సారయ్య హతం
* దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్‌గా బాధ్యతలు
* ఇప్పటికీ పార్టీలో కీలకంగా పలువురు ..
* ఉమ్మ డి జిల్లా నుంచి 26 మంది విప్లవోద్యమంలో..
* ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా ఉలిక్కిపడుతున్న కుటుంబాలు
* లొంగిపో బిడ్డా అంటూ తల్లిదండ్రుల వేడుకోలు..

### ఇప్పటికీ 26 మంది ...

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధికి చెందిన వారు దాదాపు 17 మంది, భూపాలపల్లికి చెందిన నలుగురు, ములుగు జిల్లాకు చెందిన ఐదుగురు.. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తంగా మావోయిస్టు పార్టీలో 26 మంది పని చేస్తున్నట్లు సమాచారం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి అలియాస్ గణేష్ ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ కార్యదర్శిగా పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనతోపాటు కందగట్ల యాదగిరి, ముప్పిడి సాంబయ్య సెంట్రల్ కమిటీలో కొనసాగుతున్నారు. ములుగు జిల్లా తట్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీగా ఉన్నారు. వీరితోపాటు జోనల్ కమిటీలోనూ పలువురు పని చేస్తున్నట్లు సమాచారం.

### వరుస ఎన్‌కౌంటర్లు

- 2024 ఏప్రిల్ 16న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్లో భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామానికి చెందిన సుధాకర్ అలియాస్ మురళి అలియాస్ శంకర్రావు మరణించారు. ఆయన భార్య ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రజిత సైతం ప్రాణాలు కోల్పోయారు.
- అదే ఏడాది ఏప్రిల్ 30న ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కేశవేణి రవి అలియాస్ వినయ్ చనిపోయాడు.
- జూలై 25న ములుగు భద్రాద్రి జిల్లాల సరిహద్దు దామెరతోగు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లో భూపాలపల్లి జిల్లా గణపురం మండలానికి చెందిన అశోక్ అలియాస్ విజేందర్ కన్నుమూశాడు.
- సెప్టెంబర్ 5న కాజీపేట మండలం టేకులగూడెంకు చెందిన మావోయిస్టు కీలక నేత మాచర్ల యేసోబు అలియాస్ ఎల్లన్న అలియాస్ జగన్ అలియాస్ రణదేవ్ దాదా దంతెవాడ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్లో నేలకొరివారు.
- తాజాగా నిన్న ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హన్మకొండ జిల్లా కాజీపేట మండలం తరాలపల్లి గ్రామానికి చెందిన అంకేశ్వరం సారయ్య అలియాస్ సుధీర్ అలియాస్ సుధాకర్ అలియాస్ మురళీ హతమయ్యారు. దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్‌గా ఉన్న సారయ్యపై రూ. 25లక్షల రివార్డు ఉంది. గతంలోనూ పలువురు మావోయిస్టు పార్టీ కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో చనిపోయిన సంగతి తెలిసిందే.

### లొంగిపో బిడ్డా...

మావోయిస్టు పార్టీలో మిగిలిన వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడంపై పోలీసులు దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే లొంగుబాట్లను ప్రోత్సహిస్తూ దండకారణ్యంలో వయోభారం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని జనారణ్యంలోకి రావాలని ఆహ్వానిస్తున్నారు. లొంగిపోతే వారిపై ఉన్న కేసులను ఎత్తివేయడంతోపాటు రివార్డు అందిస్తామని, అన్ని విధాలా అండగా ఉంటామని చెబుతున్నారు. ఇటీవల కొద్ది నెలల కింద ములుగు, భూపాలపల్లి జిల్లా పోలీసులు మావోయిస్టు కుటుంబాలను కలిశారు. వృద్ధాప్యంలో అనారోగ్యంతో ఇబ్బ ందులు పడుతున్న వారి తల్లిదండ్రులు, కుటుంబీకులకు నిత్యావసరాలు, మందులు అందించారు. దశాబ్దాలుగా నమ్మిన సిద్ధాంతాన్ని కట్టుబడి ఉన్నవాళ్లు విప్లవోద్యమాన్ని వీడి జన జీవనంలోకి వస్తారా..? పోలీసుల ప్రయత్నం ఫలిస్తుందా వేచి చూడాల్సిందే.

### అమరులపల్లె తరాలపల్లి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టులకు కంచుకోటలాంటి గ్రామాల్లో తరాలపల్లి ఒకటి. 1980. 90 దశకంలో ఇక్కడ యువకులు చాలామంది రైతు కూలీ ఉద్యమాలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు చేసి అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ గ్రామానికే చెందిన బండి ఆశాలు, వేల్పుల ఉప్పలయ్య, కౌముది, ముప్పిడి నాగేశ్వరరావు, పేరాల సంపత్, గాజుల శ్రీనాథ్, కొత్తపల్లి సాంబయ్య, అంకేశ్వరం సారయ్యతో కలిపి మొత్తం ఎనిమిది మంది వివిధ ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. స్థానికుడైన ముప్పిడి సాంబయ్య అలియాస్ ప్రభాకర్ ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు. ప్రస్తుతం సెంట్రల్ కమిటీ మెంబర్‌గా పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# మట్టిని అడ్డగోలుగా మింగేస్తున్నారు..!

- కాటారం సబ్ డివిజన్ మండలాల్లో జోరుగా అక్రమ మట్టి దందా
- అభివృద్ధి పనుల పేరుతో కాంట్రాక్టర్ల దుశ్చర్యలు
- చెరువు, అటవీ, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు
- సెలవు దినాల్లో అపకార్యాలకు పాల్పడుతున్న వైనం
- కఠిన చర్యలు తీసుకోకుండా వంత పాడుతున్న అధికారులు

అక్షరదర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని మండలాలైన కాటారం, మహాముత్తారం, మల్హార్,మహదేవపూర్, పలిమెల మండలాల్లో కొందరు కాంట్రాక్టర్లు దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. అభివృద్ధి పనుల చాటున మట్టి దందా సామ్రాజ్యాన్ని సృష్టిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు.ప్రభుత్వ పనుల్లో అనుమతుల ప్రకారం మట్టిని వినియోగించాల్సింది ఉండగా అవే తమకు చెల్లవంటూ అడ్డగోలుగా మట్టిని మింగేస్తున్నారు. ఇదేంటని అడ్డొచ్చే ఎంతటి వ్యవస్థనైనా సరే వారి దగ్గరున్న పచ్చ నోట్లకు బానిసలుగా చేస్తూ తమ దందాను నడిపించుకుంటున్న తీరు ఔరా అనిపిస్తున్నది. దీంతో కాటారం సబ్ డివిజన్ మండలాల్లో అక్రమ మట్టి దందా మాఫియా రాజ్యమేలుతుండగా సంబంధిత అధికారులు కంటి తుడుపు చర్యలు తీసుకుంటున్న తీరు పలు అనుమానాలకు తావిస్తున్నది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పా అక్కడి మట్టి దందా వ్యవహారం తెలియనట్లుగాఅధికారులు వ్యవహరిస్తున్నట్లుగా వారిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



### - సెలవు దినాల్లో సాఫీగా కానిస్తున్నారు..!

కాటారం సబ్ డివిజన్ మండలాల్లో అక్రమ మట్టి దందా వ్యవహారంలో కొందరు కాంట్రాక్టర్లు సెలవు దినాలను ఎంచుకుంటున్నారు .సెలవు దినాల కోసం ఎదురుచూడడం ఆ వెంటనే రాత్రికి రాత్రే మట్టి అక్రమ రవాణాను జేసీబీ యంత్రాల ద్వారా సాఫీగా కానిచ్చేస్తున్నారు. ముఖ్యంగా కాటారం మండలంలోని శంకారంపల్లి, ఆదివారంపేట గ్రామాల్లో, మల్హార్ మండలంలోని రుద్రారం చెరువు, మహాముత్తారం మండలంలోని యామనపల్లి పులిచేరుకుంటతో పాటు మిగతా చెరువు శిఖం భూములు, మహదేవపూర్ మండలకేంద్రలోని ఎర్రచెరువు, పలిమెల మండలంలోని లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో ఇసుక క్వారీ కోసమని మట్టిని తవ్వుతుండగా అటవీశాఖ అధికారులు స్పందించి జేసీబీని సీజ్‌చేశారు. ఇలా ఐదు మండలాల్లో చెరువుశిఖం, ప్రభుత్వ, అటవీ భూములనే తేడా లేకుండా అక్రమార్కులు మట్టి దందాకు పాల్పడుతున్న తీరు ప్రస్తుతం చర్చనీయాంశమవుతున్నది.శంకరాపల్లి గ్రామంలో అయితే ఏకంగా 40 ఫీట్ల లోతు మేర తవ్వకాలు చేపట్టి టిప్పర్ల ద్వారా మట్టిని తరలించుకుపోవడం ఆ కాంట్రాక్టర్ కే చెల్లింది.

### మట్టి దందా మాఫియాపై చర్యలు శూన్యం..!

కాటారం సబ్ డివిజన్ మండలాల్లో మట్టి దందా మాఫియాపై సంబంధిత అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పుకోవచ్చు. రాత్రింబవళ్లు అనే తేడాలేకుండా మట్టిని తరలించుకుపోతున్నప్పటికినీ సంబంధిత అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా అక్రమ మట్టి రవాణా నిర్వాహకులు సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం అందించే వ్యవహారాన్ని నడిపిస్తారని సమాచారం.

ఎవరైన స్థానికులు మట్టి రవాణాపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లయితే వెంటనే నిర్వాహకులకు సదరు అధికారి నుండి ఫోన్ వెళ్తుందని ఫోన్ చేసిన వ్యక్తి వివరాలతో సహా నిర్వాహకులకు తెలియజేస్తున్నట్లుగా సమాచారం. ఫిర్యాదులు అధికమైనప్పుడు మాత్రమే సదరు అధికారులు నామమాత్రంగా అక్కడికి వెళ్తారని కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా మర్యాదపూర్వకుంగా అక్రమార్కులను సాగనంపుతారని అందరూ చర్చించుకుంటున్నారు.

దీంతో అధికారులే మాకు శ్రీరామ రక్ష అంటూ సదరు కాంట్రాక్టర్ల అక్రమ మట్టి దందా వ్యాపారం మూడు పువ్వులు .. ఆరు కాయలుగా విరాజిల్లుతున్నట్లుగా బయట టాక్ నడుస్తుంది.



## నాయిని చొరవతో నగర ప్రజలకు ఊరట

- ఆస్తి పన్నుపై వడ్డీ బకాయిలో 90 శాతం రాయితీ
- అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- సమర్థించిన సహచర శాసన సభ్యులు
- సానుకూలంగా స్పందించిన రాష్ట్రప్రభుత్వం
- మున్సిపల్ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ..

అక్షరదర్బార్, హన్మకొండ: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో నగర ప్రజలకు ఊరట దక్కింది. ఆస్తి పన్నుపై వడ్డీ బకాయిలో 90 శాతం రాయితీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు కూడా ఆస్తి పన్నుపై వడ్డీ బకాయిలో 90 శాతం రాయితీ చేయాలంటూ శాసనసభలో నాయిని రాజేందర్ రెడ్డి ప్రశ్న లేవనెత్తారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లాగే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు ఆస్తి పన్నుపై వడ్డీ బకాయిలో 90శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. మరికొందరు ఎమ్మెల్యేలు సైతం నాయిని డిమాండ్‌ను సమర్థించారు. దీంతో ఈ అంశంపై రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలు ఆస్తిపై 90శాతం బకాయి వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం ఈ విషయాన్ని మరితగా సమీక్షించి రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలకు OTS సౌకర్యాన్ని విస్తరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం ఆస్తి పన్నుపై వడ్డీ బకాయిలో 90శాతం రాయితీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ ఇస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేసింది.

# నిర్లక్ష్యంపై కమిషనర్ ఫైర్

- పిన్ పాయింట్ ప్రోగ్రాం షెడ్యూల్ పాటించని జవాన్ కు షోకాజు నోటీసు
- క్షేత్రస్థాయిలో ట్రేడ్, ఆస్తి పన్ను వసూళ్ల తీరు పరిశీలన
- శానిటేషన్ లో పిన్ పాయింట్ ప్రోగ్రాంను అమలు చేయాలని ఆదేశాలు

అక్షరదర్బార్, హనుమకొండ: సమర్థ శానిటేషన్ నిర్వహణలో భాగంగా శానిటేషన్ అధికారులు, సిబ్బంది పిన్ పాయింట్ ప్రోగ్రాంను అమలు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 61వ డివిజన్ సిద్ధార్థనగర్ లో బుధవారం కమిషనర్ సానిటేషన్ తో పాటు ట్రేడ్, ఆస్తి పన్నుల వసూళ్ల తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శానిటేషన్ పిన్ పాయింట్ ప్రోగ్రాంను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన జవాన్ కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. శానిటరీ ఇన్ స్పెక్టర్ లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వార్డు లో పిన్ పాయింట్ ప్రోగ్రాం అమలు అయ్యేలా, పారిశుధ్య సిబ్బంది స్వీపింగ్, డ్రైన్ క్లీనింగ్ లకు చెందిన లాగ్ బుక్ ఖచ్చితంగా నిర్వహించేలా చూడాలని, సమయ పాలన పాటించాలని, ప్రతి చెత్త తరలింపు వాహనం రెండు ట్రిపులు వేయాలని అన్నారు. ఆస్తి, ట్రేడ్ పన్ను వసూళ్లకు ఏర్పాటు చేసిన బృందాలు ఖాజీపేట పరిధిలో 6 బృందాలు, కాశీబుగ్గ పరిధిలో ఏర్పాటు చేసిన 5 బృందాలు ప్రతి రోజు రూ.50 లక్షల చొప్పున ఆస్తి, ట్రేడ్ పన్నులు వసూళ్లు జరుపుతూ, దానికి సమాంతరంగా శానిటేషన్ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. సిద్ధార్థ నగర్ లో రోడ్డు మీద ఇసుక వేసి నిర్మాణం చేస్తున్న యజమానికి పెనాల్టీ విధించాలని కమిషనర్ సీఎంహెచ్ ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ ఓ డా.రాజారెడ్డి, శానిటరీ ఇన్ స్పెక్టర్ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుధవారం
26.03.2025
www.aksharadarbar.com
అక్షర దర్బార్
voice of the people

## ఎల్లుండి రక్తదాన శిబిరం

అదనపు కలెక్టర్ ఎం సంపత్ రావు



అక్షరదర్బార్, ములుగు: ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎం సంపత్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా బాధితుల కోసం ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని యువత, ఉద్యోగస్తులు, ప్రాతికేయులు, రక్తదాతలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు. ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ముఖ్యఅతిథిలుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారని ఎం.సంపత్ రావు తెలిపారు.

## ట్రాఫిక్ పోలీసులకు ఎస్పీ ప్రశంస

శాలువాతో సత్కరించిన సుధీర్ రాంనాథ్ కేకన్

అక్షరదర్బార్, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాస్కులను పంపిణీ చేసి, వారి అంకితభావాన్ని ప్రశంసించారు. ప్రత్యేకంగా శాలువాతో సన్మానించారు. అండర్ బ్రిడ్జి మూసివేయబడిన సమయంలో రైల్వే గేట్ సమీపంలో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా పర్యవేక్షించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సేవలందించిన పోలీసు సిబ్బంది అద్భుతమైన విధి నిర్వహణను ప్రదర్శించారన్నారు. వారి సేవలను గుర్తించి ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకాన్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కష్టపడి పనిచేస్తూ ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో సేవలందిస్తున్నారన్నారు. ఎండాకాలంలో సూర్యుడి తాపాన్ని ఎదురుకుంటూ విధులు నిర్వహించడం చాలా కష్టం అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, ఎస్.బి సీఐ చంద్రమౌళి, టౌన్ సీఐ దేవేందర్, ఆర్.ఐలు అనిల్, నాగేశ్వర్రావు పాల్గొన్నారు.



## తల్లీ కొడుకు ఆత్మహత్యాయత్నం

పురుగుల మందుతాగిన సరోజన, శేఖర్

మహబూబాబాద్ జిల్లా కొత్తూరులో ఘటన

ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అక్షరదర్బార్, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలంలోని కొత్తూరు (సీ) గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కొత్త సరోజన (60), శేఖర్ ఇద్దరు తల్లీ కొడుకు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రాణాలు తీస్తున్నయ్

## ప్రమాదకరంగా పాత బంగ్లాలు

- భద్రాచలంలో కుప్పకూలిన ఐదు అంతస్తుల భవనం
- పాత భవనంపై కొత్త నిర్మాణంతోనే ప్రమాదం
- పలువురు మృతి.. శిథిలాల కింద మరికొందరు !
- రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఘటన
- ట్రైసిటీలోని పాత భవంతులు పదిలమేనా అంటూ తెరపైకి చర్చ
- గతంలోనూ నగరంలో పాత భవనాలు కూలి ముగ్గురి మృతి..

అక్షరదర్బార్, వరంగల్: భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు శిథిలాల కిందే చిక్కుకుపోయారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాశంకగా.. మన భవనాలు పదిలమేనా అన్న చర్చ తెరపైకి వచ్చింది. గ్రేటర్ వరంగల్‌లోనూ పాత భవనాలు దడ పుట్టిస్తున్నాయి. వందేళ్ల కాలం నాటి బంగ్లాలు వందల సంఖ్యలో సరైన మరమ్మ త్తులులేక శిథిలావస్థకు చేరాయి. వరంగల్ బీట్ బజార్ ఏరియాతోపాటు మండిబజార్, బట్టల బజార్, వరంగల్ చౌరస్తా, హనుమకొండ చౌరస్తా ప్రాంతాల్లో శిథిల భవనాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మెయిన్ సెంటర్‌లో ఉండి కమర్షియల్ కాంప్లెక్స్‌లుగా వినియోగిస్తున్న బిల్డింగ్‌ను కూల్చుకోలేక కొందరు యజమానులు పాత బంగ్లాలకే మెరుగులు దిద్దుతున్నారు. వరంగల్ ట్రైసిటీలో శిథిలావస్థకు చేరిన పాత భవనాల కూల్చివేతలో ఆఫీసర్ల నిర్లక్ష్యం జనాల ప్రాణాలను బలిగొన్న సందర్భాలున్నాయి. 2022 జూన్‌లో వరంగల్ మండి బజార్‌లోని ఓ పాత భవనం కూలిపోవడంతో శిథిలాల కింద చిక్కి ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. అదే ఏడు ఆగస్టులో మండిబజార్లోనే ఓ ఇల్లు కూలి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు గాయపడ్డారు. పాత భవనాలు కూలిపోయే దశలో ఉన్నప్పటికీ కార్పొరేషన్ అధికారులు మాత్రం నోటీసులతోనే సరిపెడుతున్నారు. యజమానులు చేతులు తడుపుతుండటంతో ఇష్టారీతిన అనుమతులు ఇస్తూ మంజూరు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

### భద్రాచలంలో విషాదం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో విషాదం చోటుచేసుకుంది. భద్రాచలంలోని సూపర్ బజార్ సెంటర్ లో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనం కుప్పకూలింది. పాత భవనంపై ఐదు అంతస్తులు నాసిరకంగా నిర్మాణం చేయడంతో ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. భద్రాచలానికి చెందిన ఎస్కే మౌలానా అలియాస్ శ్రీపతి పాత భవనంపై గడచిన రెండేళ్లుగా ఒక్కొక్కటిగా ఐదంతస్తులు నిర్మించాడు. శ్రీపతి సేవ ట్రస్టు ద్వారా విరాళాలు సేకరించి నిర్మాణాన్ని చేపడుతున్నాడు. ఐతే పనులు నాసిరకంగా జరుగుతున్నాయని చుట్టుపక్కల వారు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అధికారులు ఆపమని చెప్పినప్పటికీ శ్రీపతి అలాగే పనులు చేపట్టాడు. ఈ నేపథ్యంలోనే ఇవాళ మధ్యాహ్నం రెండున్నర గంటలకు భవనం ఒక్కసారిగా కూలింది. నిర్మాణ పనులు చేస్తున్న కొందరు మృతి చెందారని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. సుమారు ఐదుగురు వరకు కార్మికులు మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ పర్యవేక్షిస్తున్నారు.

# ఉప ఎన్నికలు రావు

- ఎమ్మెల్యేలు ఆందోళన చెందొద్దు..
- బీఆర్ఎస్ విధానాన్నే కొనసాగిస్తున్నాం..
- ఆన్లైన్ బెట్టింగ్‌లపై కఠిన చర్యలు
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల అంశం రోజురోజుకు చర్చనీయాంశంగా మారుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎలాంటి ఉప ఎన్నికలు రాబోవని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. అసెంబ్లీలో ప్రసంగించిన సీఎం రేవంత్... బీఆర్ఎస్ నేతలు పార్టీ ఫిరాయింపులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రతి రోజూ ఉప ఎన్నికల గురించి ప్రజల్లో భయాందోళన సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ఏ సంప్రదాయం అమలులో ఉందో, అదే విధానాన్ని మేము కొనసాగిస్తున్నాం. గతంలో బీఆర్ఎస్ నేతలు పార్టీ మారిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇచ్చారు. కానీ మేం ఎవరికి కూడా పదవులు ఇవ్వడం లేదు. బీఆర్ఎస్ చేసిన తప్పులను మాపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని" ఆయన మండిపడ్డారు.

### ఆన్లైన్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం

ఆన్‌లైన్ బెట్టింగ్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. బెట్టింగ్ యాప్‌లు, ఆన్లైన్ బెట్టింగ్‌లపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బెట్టింగ్ నేరస్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ కి ప్రచారం కల్పించినవారిని విచారించామని.. ప్రచారం చేసిన వారిని ప్రశ్నించడంతోనే సమస్య పరిష్కారం కాదన్నారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఏర్పాటుతో అడ్డుకట్ట వేయాలని నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ నేరాల్లో ఏ రకంగా భాగస్వామ్యం ఉన్నా చర్యలు తప్పవని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణను ఆదర్శంగా నిలపాలని చేస్తుంటే.. దురుద్దేశ్యంతో అడ్డుపడుతున్నారన్నారు. ధరల నియంత్రణలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందన్నారు. కడుపునిండా విషం పెట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్‌పై సీఎం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## వికాస తరంగణి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం..

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణ పశువుల వైద్యశాలలో వికాస తరంగణి హనుమకొండ జిల్లా వారి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆశీస్సులతో గోపూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగణి ఉపాధ్యక్షులు రిటైర్డ్ పశు సంవర్ధన శాఖ జాయింట్ డైరెక్టర్ చాడ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఈ వికాస తరంగణి ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ అధికారుల సహకారంతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు అందిస్తామని వీటిని రైతులు వినియోగించు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కే. విజయ భాస్కర్, సహాయ సంచాలకులు డాక్టర్ పి శ్రీనివాస్, పరకాల మున్సిపల్ కమిషనర్, సిహెచ్ వెంకటేష్ పాల్గొన్నారు.



## నవోదయకు విద్వదీప్తి పాఠశాల విద్యార్థులు ఎంపిక..

అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ ఎంకె సుదర్శనన్




అక్షర దర్బార్ మల్హార్ : మండలంలోని కొయ్యూర్ గ్రామపంచాయతీ పరిధిలోగల విశ్వదీప్తి ఇంగ్లీష్ మీడియం ప్రయివేటు పాఠశాలలో నర్సరీ నుంచి 5వ తరగతి చదువుతున్న డి శరణ్య, జి సాయి మణి దీపిక విద్యార్థులు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన నవోదయ విద్యాలయ ప్రవేశ పరిక్ష రాశారు. ఈ ఎంట్రన్స్ ఫలితాలు మంగళ వారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో శరణ్య, సాయి మనిదిపికలు అర్హత సాధించి, ఆరోవ తరగతికి ఎంపికైనట్లుగా పాఠశాల కరస్పాండెంట్ ఎంకె సుదర్శన్ తెలిపారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

## మాజీ కౌన్సిలర్ సారయ్యను పరామర్శించిన సోదా...

అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపల్ 2వ వార్డు మాజీ కౌన్సిలర్ ఒంటేరు సారయ్య మూడు రోజుల క్రితం ద్విచక్ర వాహన ప్రమాదంలో కాలుకు గాయాలు కాగా పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ బుధవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొయ్యాడ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ పోరండ్ల సంతోష్, నల్లెల్ల అనిల్ కుమార్, పసుల రమేష్, బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ కార్యకర్తను పరామర్శించిన డాక్టర్ మడికొండ శీను.

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మేకల దేవరాజ్ తండ్రి మేకల ఉప్పలయ్య కోగిల్వాయి గ్రామంలో అకాల మరణం చెందగా ఉప్పలయ్య పార్థివదేహాన్ని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు డా. మడికొండ శ్రీను, నాయకులు బొచ్చు భాస్కర్, మంద సురేష్, ఆకునూరి అవినాష్ సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

– టీయూడబ్ల్యూజే (ఐజేయు) జాతీయ నాయకులు దాసరి కృష్ణారెడ్డి



అక్షరదర్బార్, హనుమకొండ: జర్నలిస్టుల సమస్యల సాధన కోసం టియుడబ్ల్యూజే (ఐజేయు) పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఐజేయు సీనియర్ జాతీయ నాయకులు దాసరి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జిల్లా యూనియన్ నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమం లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దాసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ముందుండి పోరాటం సాగిస్తున్న సంఘం టీయూడబ్ల్యూజే మాత్రమేనని అన్నారు. ఆరు దశాబ్దాల యూనియన్ చరిత్రలో అక్రిడిటేషన్లు , హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు సాధించి పెట్టడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్ నగరంతో సహా మండల కేంద్రాల్లో జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు, ఇండ్లు సాధించేందుకు పోరాడుతామన్నారు. రాష్ట్రంలో వివిధ కారణాలతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునేందుకు కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సమస్యల సాధనకై జర్నలిస్టులకు అండగా టీయూడబ్ల్యూజే నిలుస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు , హెల్త్ కార్డుల జారి , ఇతర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి అమలుపరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ కు మరే యూనియన్ సాటి రాదని గుర్తుచేసిన ఆయన దశాబ్దాల చరిత్ర ఉన్న యూనియన్ పై జర్నలిస్టులకు ఎంతో విశ్వాసం ఉందని వారి విశ్వాసానికి అనుగుణంగా జర్నలిస్టు బాధ్యులుగా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా త్వరితగతిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, పెండెం వేణుమాధవ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, జిల్లా కోశాధికారి బచ్చు పురుషోత్తం, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యులు వల్లాల బుచ్చిరెడ్డి, జిల్లా నాయకులు డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, వరప్రసాద్, ఎంఏ నయీం, గన్ను సంతోష్, పులికంటి రాజేందర్, ముదిగిరి ఓదెలు, అల్లె రామారావు, ఖాదర్ పాషా, ఎం రాజేంద్ర ప్రసాద్, రాంమోహన్, బి శ్రీహరి రాజు, కిరణ్ రెడ్డి, దామోదర్, ఎండి ఉస్మాన్ పాషా, తాండూరి గోపి తదితరులు పాల్గొన్నారు.





## అందాల కంకిగూడు..

చేసిన శ్రమకు మంచి ఫలితం దక్కితే ఆ ఆనందమే వెరప్పా.. ఇక్కడ కన్పిస్తున్న ఈ చిత్రాన్ని చూస్తే ఓ రైతు ఆనందానికి అవధుల్లేవని నిదర్శనంగా కన్పిస్తోంది. నర్సంపేట డివిజన్ చెన్నారావుపేట మండలం కోనాపురం గ్రామానికి చెందిన రైతు పున్నం నరసయ్య తన మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట పండించాడు. మంచి దిగుబడి రావడంతో ఇలా మొక్కజొన్న కంకులతో అందంగా ఆకర్షణీయంగా ఓ గూడు నిర్మించాడు. ఆ గూడు చుట్టూ కంకులతో పెన్సింగ్‌ను అందంగా ముస్తాబు చేశాడు. మొక్కజొన్న కంకులతో చేసిన ఈ గూడును చూసేందుకు రెండు కళ్లు చాలట్లేదనిపిస్తుంది. అటు వైపు వెళ్లే వారిని చూపు తిప్పుకోకుండా విశేషంగా ఆకట్టుకుంటుంది. – అక్షర దర్బార్, నర్సంపేట :

## విద్యుత్ శాఖ పొలం బాట



అక్షర దర్బార్, మల్హార్ : విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మల్లారం గ్రామంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగిపోయిన స్తంభాలను సరిచేసి చెడిపోయిన కెపాసిటర్లు బిగించారు.వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ భూపాలపల్లి టెక్నికల్ డీఈ వెంకటేశం మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వర్షాకాలంలో ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.విద్యుత్ సమస్య వచ్చినప్పుడు సొంతంగా మరమ్మ తులు చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏడీఈ చైతన్య, సబ్ ఇంజనీర్ ప్రేమలత, మండల ఇన్ చార్జ్ ఏఈఈ శేఖర్, తాడిచర్ల లైన్ ఇన్స్పెక్టర్ అశోక్, మల్లారం లైన్మెన్ నరేష్, జె ల్ఎం నరేష్ పాల్గొన్నారు.

బుధవారం
26.03.2025
www.aksharadarbar.com
అక్షర దర్బార్
voice of the people

# దరఖాస్తుల సమస్యలు పరిష్కరించాలి

అక్షరదర్బార్, చిట్యాల: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జయశంకర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో సమస్యలను తక్షణం పరిష్కరించే చర్యలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య కోరారు. బుధవారం చిట్యాల మండల కేంద్రంలో ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర నాయకులు దూడపాక సాంబయ్య, అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకులు కనకం తిరుపతి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు పెద్ద ఎత్తున పేరుకుపోయాయని, ఎలాంటి సమస్యలు పరిష్కరించబడలేదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల సమస్యలు గ్రామాల్లో ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయని వారు తెలిపారు. మండలాలలో నిర్వహించే ప్రజా వాణిలో దరఖాస్తులు చేసుకోవాలని వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని అధికారులు తెలిపినప్పటికీ ఇంతవరకు వాటిని పరిష్కరించకపోవడం బాధాకరమని అన్నారు. గత సోమవారం చిట్యాలలో నిర్వహించిన ప్రజా వాణితో పాటు ఈ సోమవారం ప్రజా వాణికి అనేక సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. చిట్యాల మండల కేంద్రంలోని దళితులకు ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి సంవత్సరాలు గడిచిపోతున్న ఎలాంటి పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు ఇచ్చిన 5 ఎకరాల భూమికి హద్దులు సరి చేయాలని తాము అధికారులకు అందించిన దరఖాస్తుతో పాటు మిగిలిన దరఖాస్తులను వెంటనే జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.



# సెలూన్ షాపుల బంద్

అక్షరదర్బార్, చిట్యాల: భూపాలపల్లి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం పిలుపు మేరకు చిట్యాల మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం బుధవారం బంద్ పాటించింది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరునగర్ లో కార్పొరేట్ సెలూన్ ఏర్పాటును నిలిపివేయాలని, కులవృత్తుల మనుగడ కొనసాగాలని జిల్లా సంఘం పిలుపు మేరకు చిట్యాల మండల వ్యాప్తంగా అన్ని సెలూన్ షాప్ లు బంద్ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం నేతలు మేడిపెల్లి శ్రీనివాస్, తూముల సంజీవ్, మాదాసు నాగరాజు, దేవేందర్ , తూముల శైలెందర్, రాజు కుమార్, మేడిపెల్లి రమేష్, మురహరి భాను చందర్, భూపతి, సూత్రపు శివాజీ, నాగవంశి భాస్కర్, ఓదెల రాజేష్, రాజు, తిరుపతి, సంతపురి మహేష్, రవితేజ, కొమ్ము రయ్యా, రాకేష్, మహేష్, రాములు తదితులు పాల్గొన్నారు.




# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

## వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద



నల్లబెల్లి అక్షర దర్బార్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరా ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. బుధవారం నల్లబెల్లి మండలంలోని రామతీర్థం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఏర్పాటు చేసిన భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. మార్చి 31లోపు బేస్మెంట్ లెవెల్ పూర్తి చేసుకున్నట్లయితే లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి నేరుగా తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఇందిరమ్మ హౌజింగ్ పీడీ గణపతి, తహసీల్దార్ ఉప్పు కృష్ణ, ఎంపీడీఓ నరసింహామూర్తి, మిషన్ భగీరథ ఏఈ ఏపీఓ వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




నర్సంపేట అక్షర దర్బార్ : ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గురువారం నర్సంపేట మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ఎల్ఆర్ఎస్ క్రింద క్రమబద్ధీకరణకు చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 26 ఆగస్టు 2020 కు ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, లే అవుట్ల క్రమబద్ధీకరణ ఈ నెల 31 తో ముగుస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రిబెట్ పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ప్లాట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరకాస్తుదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆడిగి తెలుసుకొగా అధికారులు బాగా స్పందిస్తున్నారని వారు తెలిపారు. నర్సంపేట మునిసిపల్ పరిధిలో 5732 మంది దరకాస్తూ చేసుకోగా 2271 క్రమబద్ధీకరణకు మంజూరు చేయగా, 293 మంది ఫీజు చెల్లించారని, 186 మందికి క్రమబద్ధీకరణ పత్రాలు అందజేయడం జరిగిందని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సంధ్య, టీపీఓ వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# రెడ్యాల గ్రామంలో బంగారు మైసమ్మ కల్యాణ మహోత్సవం



అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామంలో బంగారు మైసమ్మ దేవస్థానంలో దేవీ కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తుల సందడి మధ్య, వేద మంత్రోచ్చారణలతో, పవిత్ర మంగళ వాయిద్యాల నడుమ ,ఒగ్గు పూజారులు పూజల మధ్య అమ్మ వారి కళ్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు. ప్రజలందరికీ శుభాలు జరగాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ చైర్మన్ పాల్వాయి రామోహన్ రెడ్డి, మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం, జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి వెంకటరమణ, ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు పొన్నాల యుగంధర్, వార్డెన్ మోహన్ భిక్షపతి, సురేందర్ రెడ్డి, నర్సింగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా పోచమ్మ బోనాలు

అక్షరదర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలోని చింతలపల్లి గ్రామంలో బుధవారం పోచమ్మ తల్లి బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుభిక్షంగా ఉంటూ పాడిపంటలు సమృద్ధిగా ఉండేలా దీవించాలని గ్రామ దేవత అయిన పోచమ్మ తల్లిని వేడుకున్నారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ళు పంబల వారి వాయిద్యాలతో కోడి పిల్లలు, గొర్రెపిల్లలను కళ్ళు ముంతలను బోనాలను ఊరేగిస్తూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం తల్లికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు జరిపి గ్రామాన్ని చల్లగా ఉండేలా దీవించాలని ప్రజలంతా తల్లిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల్లోని పుర ప్రముఖులు, అన్ని సంఘాలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు

